
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 7 నవంబర్ 2022







# నేడు ఓట్లు నమోదుకు చివరి రోజు..!

## గ్రాడ్యుయేట్, టీచర్లు ఓట్లు వేగవంతం - గ్రాడ్యుయేట్లు ప్రస్తుతం 71,553 , టీచర్లు 4,065

**తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్, టీచర్ల ఎన్నికలకు ఓట్లు నమోదుకు నేడు చివరి రోజు. ఒక్క రోజు మాత్రం అవకాశం ఉండడంతో పెద్ద ఎత్తున ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోడానికి ఓటర్లు సిద్ధమయ్యారు. తూర్పు రాయలసీమ పరిధిలో బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలు వస్తున్నాయి. 2017 నాటికి ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లు 2,18,357 మంది, టీచర్లు 20,257 మంది ఓట్లు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం 5 తేదీ వరకు నియోజకవర్గ పరిధిలో 2,45,821 మంది గ్రాడ్యుయేట్లు, 11,060 మంది టీచర్లు ఓట్లు నమోదు చేసుకున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఓట్లు నమోదు కాలేదు. నేడు ఒక్కరోజే అవకశాం ఉంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ధరఖాస్తుచేసుకోడానికి అవకాశం ఉంది. నెల్లూరు జిల్లాలో ఇప్పటి వరకు 71.553, మంది గ్రాడ్యుయేట్లు, 4065 మంది టీచర్లు ఓట్లు నమోదు చేసుకున్నారు.**




**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**

తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్, టీచర్ల నియోజ కవర్గం ఎంఎల్‌ఎసి ఎన్నికలు ఓట్లు చేర్పు తుదిదశకు చేరుకుంది. అధికార వైసిపి ఈ దపా ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. 2024లో జరిగే సాధారణ ఎన్నికలకు వీటిని సెమీ ఫైనల్‌గా భావిస్తున్నారు. అధికార వైసిపి ఎంఎల్ఎలు, నాయకులు ఓట్ల చేర్పులోనే అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులను ఇందు కోసం ఉపయోగించుకుంటున్నారు. ప్రభుత్వ టీచర్లు, గ్రాడ్యుయేట్‌లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకంగా ఉన్న విషయం తెలిసిందే. దీని నుంచి బయటపడి సాధారణ ఎన్నికల్లో వలే ఎలాగైనా గెలవాలనే ఆ పార్టీ నేతలు అంతా తామై చేస్తున్నారు. గతంలో ప్రశాంతంగా సాగే ఈ ఎన్నికల్లో అధికారపార్టీ జోక్యంతో ఉత్కంఠ రేగుతున్నాయి. సాధారణ ఎన్నికల వలే నగదు చెల్లించి ఓటర్లును కోనుగోలు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏ నియోజవర్గంలో ఎంత మెజార్టీ వస్తుం దని ఇప్పటి నుంచే లెక్కలు కడుతున్నారు. పిడిఎఫ్ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేయడం తోపాటు, అనేక ఉపాధ్యాయ సంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయి. ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు పెద్దఎత్తున ప్రచారం సాగిస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలనే ప్రచారం ఊపందుకుంది. ఈనెల 5వతేది వరకు భారీగానే నియోజకవర్గ పరిధిలో ఓటర్లు చేరారు. జిల్లాలోనూ పెద్ద ఎత్తున ఓట్లు నమోదు కార్యక్రమం జరిగింది. ఇక మిగిలింది ఒక్కరోజే. ఇందుకోసం భారీ కసరత్తు చేస్తున్నారు. అధికారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చే ఓట్ల నమోదుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరు ఓట్లు చేర్పునకు మరో అవకాశం ఇస్తారని ప్రచారం చేస్తున్నారు ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని, నేడు చివరి రోజు అని తెలుస్తోంది.


**జిల్లాలో 71,553 మంది గ్రాడ్యుయేట్లు 4,065 మంది టీచర్లు నమోదు ..!**

తూర్పు రాయలసీమ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓట్లు నమోదు నేడు చివరి రోజు. 5 వతేదీ నాటికి నియోజకవర్గ పరిధిలోని ఆరు జిల్లాలో భారీగా నమోదు చేసుకున్నారు. జిల్లాలో నూ గతం కంటే ఎక్కువ మంది ఓట్లు నమోదు చేసుకున్నారు. జిల్లాలోని కందుకూరు, కావలి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ , సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తున్నాయి.2017 నాటికి జిల్లా వ్యాపితంగా 55438 ఓట్లు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం 5 వతేది నాటికి 71,553 మంది గ్రాడ్యుయేట్లు, నమోదు కాగా, 2017లో 4630 మంది టీచర్లు నమోదు చేసుకోగ, 5 వతేది నాటికి 4065 మంది ఓట్లు నమోదు చేసుకున్నారు. నేటితో పెరిగే అవకా శాలున్నాయి. ఏ మేరకు పెరుగుతాయో చూడాలి. మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు చేరారు. ప్రస్తుతం 2,45,821 వరకు గ్రాడ్యుయేట్ ఓట్లు చేరారు.

**5-11-22వ తేదీ వరకు జిల్లాలో ఓట్లు వివరాలు**

| నియోజకవర్గం | 2017 (గ్రా) | 2017 (టీ) | 2022 (గ్రా) | 2022 (టీ) |
|---|---|---|---|---|
| కందుకూరు | 6350 | 421 | 9414 | 271 |
| కావలి | 7304 | 617 | 8778 | 463 |
| ఆత్మకూరు | 6147 | 415 | 6422 | 387 |
| కోవూరు | 7065 | 489 | 8038 | 369 |
| నెల్లూరు సిటి | 20596 | 2104 | 9328 | 736 |
| నెల్లూరు రూరల్ | 20596 | 2104 | 17569 | 1426 |
| సర్వేపల్లి | 4905 | 426 | 6254 | 246 |
| మొత్తం | 55438 | 4630 | 71553 | 4065 |

**గమనిక : ప్రస్తుతం 5 వతేది వరకు ఉన్న ఓట్లు వివరాలు**




## ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం : కలెక్టర్

### మహిమలూరులో భారీ కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్**

ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ చక్రధర్‌బాబు సూచించారు. మండలంలోని మహిమలూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో భాను , శ్రీ రామకష్ణన్ , డాక్టర్ చిత్ర , శ్రీ వెంకట్రామన్ వారి కుటుంబ సభ్యుల సహకారంతో శంకర నేత్రాలయం కంటి వైద్యశాల చెన్నై వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంచార కంటి శస్త్ర చికిత్స యూనిట్లనుకలెక్టర్ కె వి ఎస్ చక్రధర బాబు , వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్ పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి, రక్షణ శాఖ సలహాదారులు డాక్టర్ జి .సతీష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ చక్రధర బాబు మాట్లాడుతూ ఆత్మకూరు ఏరియా ప్రజలకు మెరుగైన విద్య , వైద్యం అందించాలన్న సంకల్పంతో రక్షణ శాఖ సలహాదారులు డాక్టర్ జి సతీష్ రెడ్డి చేస్తున్న కషి అభినందనీయమన్నారు. ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించి అనేకమంది దేశ స్థాయిలో ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. వారిలో డాక్టర్ సతీష్ రెడ్డి ఒకరు కావడం గర్వకారణమన్నారు. ఈ పాఠశాలను మరింతగా అభివద్ధి చేయాలని ఆకాంక్షించారు. జిల్లాలో రెండో విడత నాడు నేడు కార్యక్రమంలో కింద 1385 పాఠశాలల్లో 468 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు అదనపు తరగతి గదులు నిర్మాణాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ డి ఆర్ డి ఎ చైర్మన్ గా రక్షణ శాఖ సలహాదారునిగా దేశ రక్షణకు ఈ ప్రాంత వాసి అయిన డాక్టర్ సతీష్ రెడ్డి చేస్తున్న సేవలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయన్నారు. ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి కషి చేస్తున్నట్లు తెలిపారు.రక్షణ శాఖ సలహాదారులు డాక్టర్ జి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ ఎస్ వి యూనివర్సిటీ ప్రొఫెసర్ వైవిరామిరెడ్డి శంకర నేత్రాలయం వైద్యశాల చెన్నై ప్రతినిధి లు డాక్టర్ అరుణ్ కుమార్ ఆర్టీవో శ్రీమతి కరుణకుమారి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్ బాబు సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీమతి ఉషారాణి మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్ కుమార్ మండల రూరల్ కన్వీనర్ జితేంద్రనాగ్ రెడ్డి , గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు, తదితరులు

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్‌పి

**నెల్లూరు :**జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌పి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లకు పోలీసు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ నిఘా పెట్టామని, సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీ , కేడీ, బిసిలను హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తుల కదలికలు, వారి కార్యాకలపాలను నిరంతరం నిఘా ఉంచామన్నారు. పోలీసులు పిలిచిన వెంటనే స్టేషన్‌కు హాజరు కావాలన్నారు. రౌడీ షీటర్లు తమ నేర జీవితానికి ముగింపు పలకాలన్నారు. నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన ప్రణాళికలు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

## ఎంఎల్‌సి అభ్యర్థుల ఆత్మీయ సమావేశం

**ప్రజాశక్తి -నెల్లూరు**

నగరంలో కష్ణ చైతన్య జూనియర్ కళాశాలలో వైఎస్ఆర్‌టియు ఆధ్వర్యంలో ఎంఎల్‌సి అభ్యర్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి కల్పలతా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పెర్నేటి శ్యాంప్రసాద్ రెడ్డిలను పరిచయం చేసుకున్నారు. అనంతరం డ్రాయింగ్ ,క్రాఫ్ట్ అండ్ పిఇఈ ఉపాధ్యాయ సంఘాలు, ఉపాద్యాయులు, చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించి మద్దతు తెలిపారు. చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎల్‌సి కల్పలతా రెడ్డి మాట్లాడారు. సేవా భావం కలిగిన చంద్రశేఖర్ రెడ్డి, శ్యాంప్రసాద్ రెడ్డిలను గెలిపించాలని కోరారు.




మాట్లాడుతున్న ఎంఎల్‌సి కల్పలతారెడ్డి



మంత్రి కాకాణిని సత్కరిస్తున్న దృశ్యం

## కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించాలి

**నెల్లూరు** :ప్రభుత్వం వెంటనే స్పందించి 98 డిఎస్‌సిలో అర్హత పొందిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డిఎస్‌సి 98 క్వాలీఫైడ్స్ బృందం కోరింది. ఆదివారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసిన అభ్యర్థులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.అర్హత కలిగిన అభ్యర్థుల సర్టిఫికేట్లు పరిశీలిన పూర్తయినప్పటికీ ప్రభుత్వం నియామకపు ఉత్తర్వులు విడుదల చేయలేదని వాపోయారు.ఈ సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి పోస్టింగ్ ఉత్తర్వులు విడుదల చేసేలా కృషిచేయాలని కోరారు. నెల్లూర్ జిల్లా అధ్యక్షుడు కటుబోని శ్రీని వాసులు, కార్యదర్శి ఎస్‌కె. ఖాసింరీజ్వి, వేణు,నయీం,జయరామ్, ఫరూఖ్, అనిత ,సునీత ఉన్నారు.

## అసత్య ప్రచారం చేస్తే చర్యలు

**పొదలకూరు :** చిన్న పిల్లలను పట్టుకునే గ్యాంగ్ సంచరిస్తుందని తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని, అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవనిఎస్ఐ కరిముల్లా హెచ్చరించారు.ఆదివారం పట్టణంలోని తొగటవీధి సమీపంలో సంచరిస్తున్న ఓ యువతిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో వివరాలు ఆరా తీయగా తాను కోట మండలానికి చెందిన యువతిగా గుర్తించారు. ఎస్ఐ కరిముల్లా మాట్లాడుతూ చిన్న పిల్లలను అపహరించే గ్యాంగ్ లేదని, అది ఒట్టి పుకార్లు మాత్రమేనని కొట్టిపడేశారు ఎవరైన అనుమానితులు సంచరిస్తూ తారసపడితే 9440700007 సమాచారం ఇవ్వాలన్నారు.

పరిశ్రమలలో

## స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి : డివైఎఫ్ఐ



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-నెల్లూరు**

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ 42వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నగరంలో పలుచోట్ల జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం డివైఎఫ్ఐ కార్యకర్తలు, యువజనులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఏర్పడి 42 సంవత్సరాల గడిచాయని అప్పటినుండి ఇప్పటివరకు యువజన సమస్య మీద పోరాడే ఏకైక సంఘం డివైఎఫ్ఐ అని ఉద్ఘాటించారు. నగరంలో మతోన్మాదానికి ,రౌడీ యిజానికి, స్కిల్ గేమ్స్ వ్యతిరేకంగా డివైఎఫ్ఐ ఎన్నో సమరశీల పోరాటం నిర్వహించిందని తెలిపారు. జిల్లాలో నిరుద్యోగం తగ్గాలంటే కష్ణపట్నం పోర్టు ఏర్పాటు కావాలని డివైఎఫ్ఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ పోరాటం ఫలితంగా కష్ణపట్నం పోర్టు పోర్ట్ ఆధారిత పరిశ్రమలు ఏర్పడినాయన్నారు. అయితే స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల వారికి తక్కువ వేతనం ఇచ్చి పని చేయించుకుంటున్నారన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కుమార్, నగర నాయకులు శేఖర్ ,మహేష్ రమణ య్య, నాని ,సునీల్ మాజీ నాయకులు సుబ్బు ,ఆర్ శ్రీనివాసులు, నక్క వెంకటేశ్వర్లు, మూలం ప్రసాద్ పాల్గొన్నారు.

**పరిశ్రమలు ఏర్పాటు చేయాలి**

జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ రూరల్ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం డివైఎఫ్ఐ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రూరల్ వైయస్సార్ నగర్ ,శ్రామిక నగర్ ,డ్రైవర్స్ కాలనీ, జ్యోతి నగర్ ప్రాంతాల్లో స్థానిక డివైఎఫ్ఐ కమిటీఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కండె కోటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి సంక్షేమ ప్రభుత్వం అంటూ సంక్షేమ పథకాలకు పరిమితమై ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా, ఈ రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేస్తానని ముఖ్యమంత్రి చేసిన హామీలను విస్మరించారన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ హామీని అమలు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు కోసం తీసుకున్న భూములలో వెంటనే పరిశ్రమలు ఏర్పాటు చేసి చేసి స్థానికులకు 75శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూరల్ డివైఎఫ్ఐ కార్య దర్శివర్గ సభ్యులు దేవతాటి రాజా, శేషయ్య ,నాని శివ, ఆదం మాజీ డివై ఎఫ్ ఐ నాయకులు సంపత్ కుమార్ ,కాలేశా, సేనా రెడ్డి ,కష్ణ ,ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీనగర్ కాలనీలో, 16వ డివిజన్‌లో, 53, 14 డివిజన్లలో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను ఆవిష్కరించి కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు.



## డాక్యుమెంట్లు అందజేయాలి

**కందుకూరు:**స్థానిక ఖజానా కార్యాలయంలో పెన్షన్ దారులు వార్షిక ఆదాయ పన్ను వివరాలకు సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పించాలని గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కందుకూరు సెక్రటరీ ఎంఎస్ రాంబాబు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ తీసుకుంటున్న వారు కందుకూరు ఖజానా కార్యాలయం సంచాలకుల ఆదేశానుసారం 2022- 2023 వార్షిక పెన్షన్ చెల్లించవలసిన ఆదాయ పన్నుకు సంబంధించి నా పొదుపు వివరాలు ఈ నెల 25వ తేదీ లోపు ఖజానా కార్యాలయంలో సంబంధిత ద్రవ పత్రాలతో పాటు సపోర్టు డాక్యుమెంట్స్ అందజేయాలని ఆయన కోరారు.



## విరాళం అందజేత

**కందుకూరు :** కందుకూరు అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం కోసం ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. ఆదివారం కీర్తిశేషులు ఉప్పుటూరి కోటమ్మ జ్ఞాపకార్థం మనవడు కూనం మాధవరావు,మనుమరాలు రాధిక రూ.25116లు, కీర్తిశేషులు కూనం మాలకొండయ్య జ్ఞాపకార్థం భార్య సుశీల,కుమారుడు మాధవరావు, కోడలు రాధిక రూ.25116లు విరాళం అందజేశారు. ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, తల్లపనేని వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నెల్లూరులో...

## ఉచిత వైద్య శిబిరం


**నెల్లూరు :** నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జెవివి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

**కలువాయి :**స్థానిక జెడ్‌పి వి ఎన్ ఆర్ హై స్కూల్లో డాక్టర్ బోరుగళ్ల మస్తాన్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ బొరుగుల మస్తానా యాదవ్ పాల్గొన్నారు.




కలువాయిలో...

## సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం



కందుకూరులో..

**ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర అనేది ఒక సువర్ణా ధ్యాయమని వైసిపి కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ పేర్కొన్నారు. ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఐదేళ్లయిన సందర్భంగా ఆదివారం మండలంలో వేడుకలు ఘనంగా జరిగాయి. శంకరయ్య గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత పడుతున్న కష్టాలకు ప్రధాన కారకుడు చంద్రబాబు అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల సమస్యలు పరిష్కరిం చాలని సంకల్పించి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టడం జరిగిందని శంకరయ్య గౌడ్ తెలిపారు.వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కేక్ కట్ చేసి తమ ఉత్సాహాన్ని చాటుకొన్నారు. జెడ్పిటీసి శేషమ్మ, జై గౌడ్ జిల్లా ఉద్యమం అధ్యక్షులు, ఏఎంసి డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, మాజీ జెడ్పిటిసి చిరంజీవి గౌడ్, ఎంపీటీ సంధ్యారాణి, తిరుపతయ్య పాల్గొన్నారు.

**పొదలకూరు :** సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించి ఐదేళ్లయిన సందర్భంగా ఆదివారం పలు చోట్ల వేడుకలు నిర్వహించారు. ప్రజా సంకల్ప యాత్రంలో భాగంగా నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి జిల్లాలోని పొదలకూరు సైదాపురం మండలాల సరిహద్దు ప్రాంతమైన మలిచేడు వద్ద, ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు.

**కందుకూరు :**ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వ ర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేపట్టి నేటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణ వైసిఎ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు ఎస్.కె. రఫీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి నేతలు ఆర్ బ్రహ్మానందం, గంగవరపు వెంకట్రారావు, ఇంటూరి మాధవ పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరులో..

## వైసిపి పాలనలో బాదుడే.. బాదుడు..

**ప్రజాశక్తి -కందుకూరు**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆర్భాటంగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్ల వల్ల పేదలకు ఒరిగిందేమీ లేదని, ప్రధానంగా ముస్లిం మైనారిటీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారని టిడిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా కందుకూరు పట్టణంలోని 15వ వార్డు అజ్మల్ హుస్సేన్ హాస్పిటల్ ఏరియా, ఖాజీపాలెం ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ కులాలకు సంబంధించి 130కు పైగా కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్పొరేషన్ చైర్మన్లు, సభ్యులతో అట్టహాసంగా ప్రమాణ స్వీకారాలు కూడా చేయించారన్నారు. ఇంతవరకు కార్పొరేషన్లకు ఒక్క పైసా కూడా కేటాయించలేదని, ఒక్కరు కూడా వాటి వల్ల లబ్ది పొందలేదన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి లక్షల మంది నిరుపేదలకు రుణాలు, ఇతర సహాయాలు అందించారని నాగేశ్వరరావు తెలిపారు. కందుకూరు గడ్డపై తెలుగుదేశం జెండా ఎగిరేలా ప్రజలు మద్దతు పలకాలని నాగేశ్వరరావు కోరారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు షేక్ ఖలీల్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సలాం, వార్డు నాయకులు షేక్ బాషా, షేక్ అయాజ్ ఖాన్, కరిముల్లా, అబ్దుల్ అహ్మద్ , గౌస్ బాషా, రూబీ, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల సుబ్బారావు, నియోజకవర్గ ఐటిడిపి కోఆర్డినేటర్ మున్నా, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పులి నాగరాజు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు సవిడి బోయిన వెంకటకష్ణ, వడ్డెళ్ల రవిచంద్ర పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

# కుష్టువ్యాధి రహిత సమాజ నిర్మాణానికి కృషి

**ఎయిడ్స్ అండ్ లెప్రసీ నివారణాధికారి డాక్టర్ వెంకటప్రసాద్**

**ఇంటర్వ్యూ..**

**ప్రజాశక్తి-నెల్లూరు**

**గతంలో లెప్రసీ (కుష్టు) వ్యాధి అంటే ప్రజలు తీవ్ర భయాందోళనలకు లోనవుతుండే వారు. వైద్యశాస్త్రం వేగంగా అభివృద్ధి చెంది అనేక వ్యాధుల నియంత్రణకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్‌లను ఆస్పత్రులల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందజేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో కుష్టువ్యాధి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటుందో ఎయిడ్స్ అండ్ లెప్రసీ నివారణాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ మాటల్లో ...**



**ప్రశ్న. లెప్రసీ వ్యాధి లక్షణాలు ఏమిటీ.. ఎలా వ్యాపిస్తుంది.. చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయా..?**

**జవాబు.** శరీరంపై పోలిపోయిన, రాగి రంగులో మచ్చలు ఏర్పడినా.. ఆ మచ్చలపై స్పర్శ లేక నొప్పి లేకపోయినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. శరీరంలో ముఖ్యంగా పాదాలు, చేతులు, వేళ్ల తిమ్మెరలు పెడుతునా, చర్మం దళసరిగా మారిపోతున్నా. ముఖ్యంగా ముఖం నూనె రాసినట్లు నిగనిగలాడుతూ కనిపిస్తే కుష్టు వ్యాధి లక్షణాలుగా భావించి వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. లెప్రసీ వ్యాధి వల్ల శరీరం అంతా పుండ్లుతో నిండిపోతుంది. ఇది చర్మానికి, నాడీ వ్యవస్థకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధి. మ్యూకస్ పొరను ప్రభావితం చేస్తుంది. క్షయ కారకమైన మైక్రో బ్యాక్టీరియాకు చాలా దగ్గర సంబంధం ఉంటుంది. ఈ బ్యాక్టీరియా పేరు మైక్రో బ్యాక్టీరియం లెప్రేగా పిలుస్తారు. ముఖ్యంగా ఛాతీ, పొట్టపైన పొక్కులు లేవడం కనిపిస్తుంది. కుష్టు వ్యాధి ఇతర అంటువ్యాధుల వలే ఒక సూక్ష్మక్రిమి వల్ల వస్తుంది. 1873 సంవత్సరం హాన్సన్ అను నార్వే శాస్త్రవేత్త ఈ వ్యాధికి కారణమైన జీవిని సూక్ష్మదర్శనిలో గుర్తించాడు. ఈ వ్యాధి వ్యాధిగ్రస్తుని నుండి గాలి ద్వారా, సన్నిహిత సంబంధాల ద్వారా ఇతరులకు సులువుగా వ్యాప్తి చెందుతుంది.

**ప్రశ్న. ఈ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటీ, ఎన్ని రోజుల్లో లెప్రసీ వ్యాధి నయం అవుతుంది..?**

**జవాబు.** ఎవరైనా కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించినా.. అనుమానం వచ్చినా వెంటనే సమీపంలోని కుష్టు వ్యాధి నిర్మూలన కేంద్రానికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకోవాలి. వ్యాధి తీవ్రతను బట్టి 6 నెలల నుంచి 12 నెలల వరకు మందులు మింగాల్సి ఉంటుంది. ఈ వ్యాధికి గురైన వారు సమాచారాన్ని దాచడం వల్ల పక్కవారికి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎట్టి పరిస్థితుల్లో వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలి. ఈ వ్యాధి నివారణకు బహుళ ఔషధ (మల్టీ డ్రగ్) చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఈ చికిత్స ఎంతో నమ్మకమైంది. ఈ వ్యాధి ఏదశలో ఉన్నప్పటికీ ఈ మందులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అంగవైకల్యాన్ని జయించవచ్చు. కుష్టు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీ(పీబీ)గా గుర్తిస్తారు. వారికి ఆరు నెలలు చికిత్స ఉంటుంది. కనీసం 9 నెలల్లో కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. ఐదు మచ్చలు కంటే ఎక్కువ మచ్చలు ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీ(ఎంబీ)గా గుర్తిస్తారు. వారికి 12 నెలలు చికిత్స ఉంటుంది. కనీసం 15 నెలల్లో కోర్సును పూర్తి చేయాలి. బహుళ ఔషధ చికిత్సతో కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. దాదాపు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు ఖర్చయ్యే మందులను పూర్తిగా ఉచితంగా వ్యాధి గ్రస్తులకు అందిస్తారు. 6 నెలలు నుంచి 12 నెలల వరకు చికిత్స తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయం అవుతుంది.

**ప్రశ్న. 2021లో ఎంత మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.. ఎంతమందికి టి.బి. ఉన్నట్లు నిర్ధారణ అయింది.. క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి ఎంత మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించారు..?**

**జవాబు.** 2021లో జిల్లాలో 32,22,865 మంది జనాభా ఉంటే ప్రభుత్వం 38,122 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. అయితే వైద్యఆరోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థల సంయుక్త కృషితో 41,400 పరీక్షలు నిర్వహించాం. 5,597 మందికి టి.బి. లక్షణాలు ఉన్నటు నిర్ధారణ అయింది. జిల్లాలో క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు చేయగా 4,690 మందికి లక్షణాలు ఉన్నట్లు గుర్తించాం. 2020 సంవత్సరంలో క్షయ వ్యాధి గ్రస్తులకు పూర్తి స్థాయిలో మందులు, ఒక క్రమపద్ధతిలో వాడటంతో 3,324 మంది టి.బి.ని జయించారని చెప్పడానికి ఎంతో ఆనందంగా ఉంది. 2021లో టిబి వ్యాధి గ్రస్తులు చక్కెర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోగా 4,435 మందికి మధుమేహ వ్యాధి నిర్ధారణ అయింది.

**ప్రశ్న. జిల్లాలో ఎంత మంది మల్టీడ్రగ్ రెసిస్టెంట్ క్షయ వ్యాధిగ్రస్తులున్నారు. ఈ మందులు వాడటం వల్ల ఇప్పటి వరకు ఎంత మంది టిబిని జయించారు..?**

**జవాబు.** జిల్లాలో 2019వ సంవత్సరంలో మల్టిడ్రగ్ రెసిస్టెంట్ మందులను వైద్యుల సలహాలు, సూచనల మేరకు 251 మంది తీసుకున్నారు. 199 మంది పూర్తి ఆరోగ్యవంతులుగా కోలుకున్నారు. 2021లో 205 మందికి మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ మందులు అవసరమని ప్రభుత్వం గుర్తించి బాధితుల పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వీరందరికి ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో మందులు పంపిణీ చేస్తున్నాం.



మాట్లాడుతున్న మూలి వెంగయ్య

## వ్యవసాయ మీటర్లను రద్దు చేయాలి

**ప్రజాశక్తి-సీతారామపురం**

వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లను బిగించే పద్ధతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీరాములు, మూలి వెంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బసినేనిపల్లి గ్రామంలో మండల రైతు మొదటి మహాసభలు అగ్నిగుండాల నాగూర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం మొత్తం వ్యవసాయంపై ఆధారపడి ఉందని గత ఏడు సంవత్సరాలుగా కరువు ఏర్పడడంతో అధిక మంది బతుకుదెరువు కోసం వలస పోతున్నారని, ఉన్నవారు వ్యవసాయం చేసుకోవాలన్న ప్రభుత్వం నుండి తగిన సహకారం లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కరువులో సైతం ప్రత్యామ్నాయ పంటలు పండే విధంగా ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అధిక పెట్టుబడితో సజ్జ, జొన్న మొక్కజన్న వంటి పంటలు పండించినా వాటిని అమ్ముకోవాలంటే కొనే నాథుడే లేక తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రైతన్నలకు ఏర్పడిందన్నారు. పంట కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా మాత్రమే ఉన్నాయని, మండలాన్ని కరువు నుండి శాశ్వతంగా రక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్షుడిగా నాగూర్ సాహెబ్, కార్యదర్శిగా చింతనబోయిన రత్తయ్యలతో పాటు 23మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాకు వెంకటయ్య, సిఐటియు నాయకులు కోడే రమణయ్య, డివిజన్ రైతు సంఘం నాయకులు నాగూర్ సాహెబ్, చింతనబోయిన రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణం



**ప్రజాశక్తి-ఉదయగిరి**

ఎంపిటిసి కాకు విజయ సమక్షంలో సిపిఎం, రైతు సంఘం నాయకులు దళితుల స్వతంత్రం నాటి రహదారి బ్రిడ్జి కలను నెరవేర్చారు. ఆదివారం మండల పరిధిలోని బిజంపల్లి హరిజనవాడ రహదారి బ్రిడ్జి నిర్మాణాన్ని గ్రామ దాతల సహకారంతో నిర్మాణం పూర్తి చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు కాకు వెంకయ్య, ఎంపిటిసి కాకు విజయ మాట్లాడుతూ హరిజనవాడ నుంచి రహదారితో పాటు బ్రిడ్జి లేకపోవడంతో ప్రాంతవాసులు అనేక కష్టాలు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే ఆ ప్రాంతంలోని చిన్న వాగు ఉప్పొంగి ప్రవహిస్తే వాడకు ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయన్నారు. స్థానిక అధికార పార్టీ నాయకులతో పాటు అధికారులకు కూడా విన్నవించినా ఫలితం లేకపోవడంతో సిపిఎం, రైతు సంఘం దాతల సహకారంతో రోడ్డుతో పాటు తాత్కాలికంగా బ్రిడ్జి కూడా నిర్మించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారితో పాటు శాశ్వత బ్రిడ్జి నిర్మించి దళిత కుటుంబాలను ఆదుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. కాలనీవాసుల కల నెరవేరడంతో స్థానిక సిపిఎం నాయకులు, ఎంపిటిసి తీర్మానంతో కాలనీ మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

## మరుగుదొడ్ల శ్లాబ్ ప్రారంభం

**ప్రజాశక్తి-ఉదయగిరి** : టెంకాయ కొట్టి మరుగుదొడ్ల శ్లాబ్‌ను ఆదివారం ఎంఇఒ షేక్ మస్తాన్‌వలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మనబడి నాడు-నేడు ఫేస్-2లో ఎంపిపిఎస్ గంగిరెడ్డిపల్లి పాఠశాలకు నూతన టాయిలెట్స్ మంజూరయ్యాయని అందులో భాగంగా స్లాబ్ ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సిమెంటు ఇసుక కంకర వేయాలని, స్లాబ్ వేస్తున్నప్పుడు వైబ్రేటర్ తప్పనిసరిగా ఉపయోగించాలని మేస్త్రీలకు, పాఠశాల నాడు-నేడు కమిటీ సభ్యులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు జ్యోతి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుధాకర్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కంపచెట్లు తొలగింపు

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలోని బూదవాడ పంచాయతీలో రోడ్ల కిరుపైపులా, ఇళ్ల మధ్య పెరిగిన ముళ్ల చెట్లను ఆదివారం వైసిపి నాయకులు జెసిబి సాయంతో తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దోమలు, విష సర్పాలకు నిలయంగా మారాయి. అలాగే గ్రామంలో విద్యుత్ తీగల కింద ముళ్లచెట్లు పెరిగి వైర్లకు పెనవేసుకొని ప్రమాదకరంగా మారి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుండటంతో చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చెట్లను తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్న వాటిని గుర్తించి సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి పెద్దలు, పిల్లలకు అందకుండా చేశారు. పంచాయతీలో దెబ్బతిన్న నీటి పైపులను మరమ్మతులు చేసి నీటి సమస్యను పరిష్కరించామన్నారు.

## టిడిపి గెలుపునకు కృషి చేయాలి

**ప్రజాశక్తి-కావలి** : కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు అధ్యక్షతన అన్నగారిపాలెం పంచాయతీ ఒట్టూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం టిడిపి నాయకులు కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్నగారిపాలెం పంచాయతీకి సంబంధించిన పార్టీ నాయకులు, అన్ని గ్రామాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు మాట్లాడుతూ అన్నగారిపాలెం పంచాయతీలో పార్టీ బలోపేతానికి చేయవలసిన కార్యాచరణపై చర్చించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి టిడిపి గెలుపునకు తమ వంతుగా అందించే సలహాలను స్వీకరించారు. ప్రతి కార్యకర్త రోజులో కొంతసేపు పార్టీకి పనిచేస్తే మన గెలుపు సులభతరం అవుతుందని వచ్చిన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పాల వెంకటేశ్వర్లు, బడుగు వెంకయ్య, పులి సుధాకర్, వాయిల శ్రీనివాసులు, తుళ్లూరు సుధాకర్, పెంబూరు వెంకటేశ్వర్లు, పులి రమేష్ యాదవ్, లక్ష్మణరావు, పులి శివ, మోర్ల సురేష్‌గౌడ్, మస్తాన్, నరసింహం, అప్పగిరి పరమేశ్వరరావు, అప్పాడి నాగరాజు, శ్రీనివాసులు, నాసిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక వన భోజనాలు

**ప్రజాశక్తి-కావలి** : కార్తీక మాస సందర్భంగా ఆదివారం బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం వనభోజనాలు ముసునూరు సాయి క్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7:30 నుంచి 10 గంటల వరకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. తదుపరి శివపార్వతుల కళ్యాణం 10.30 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమం కావలి బ్రాహ్మణ సంఘం తరఫున ప్రెసిడెంట్ వి వి ఎస్ ప్రసాద్, సెక్రటరీ టి వి ఎం ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులందరూ హాజరయ్యారు. పురోహితులు ఎంతో పెద్ద మనసుతో అన్ని కార్యక్రమాలు ఉచితంగా అందించారు.

## యాత్రికులకు సిఐ సూచనలు

**ప్రజాశక్తి-కావలి** : కావలి రూరల్, బిట్రగుంట, అల్లూరు, దగదర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు కార్తీక స్నానాల సందర్భంగా కావలిరూరల్ పోలీస్ సి.ఐ. రాజేష్ పలు జాగ్రత్తలు, సూచనలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున సముద్ర స్నానానికి మోటార్ సైకిళ్లపై వెళ్లే వారు విధిగా హెల్మెట్ ధరించి, అతివేగంగా వెళ్లకుండా జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. సముద్ర తీరం వద్ద పోలీస్ వారి బందోబస్తు ఏర్పాటు చేసి ఉందని, ఏమైనా ఇబ్బంది కలిగితే పోలీస్ వారి సహకారాలు తీసుకోవాలని తెలియజేశారు.

## నిందితుడు అరెస్ట్

**ప్రజాశక్తి-బిట్రగుంట** : బోగోలు మండలం ముంగమూరు జాతీయ రహదారిపై అక్టోబర్ 30న జరిగిన చోరీ కేసులో నిందితుడిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు కావలి రూరల్ సిఐ రాజేష్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... మచిలీపట్నం నుండి నెల్లూరుకు వెళ్తూ మంగమూరు జాతీయ రహదారి పక్కన అశోక్ లైలాండ్ వాహనాన్ని నిలుపుకొని డ్రైవర్, క్లీనర్ ఇద్దరు నిద్రిస్తుండగా వారి వద్ద నుండి గుర్తు తెలియని వ్యక్తి రూ.10వేల నగదు, 2 సెల్‌ఫోన్లు చోరీ చేశారని, ఈ విషయమై స్థానిక ఎసిఐ చిన్న బలరామయ్య కేసు విచారణలో భాగంగా నిందితుడు భరత్‌ను విచారించారు. అలాగే శనివారం అదుపులోకి తీసుకొని కావలికి ఆటోలో ప్రయాణిస్తున్న బోధ్ భరత్ అని మాలిక చెయ్యి సంధిలో కేసు పెద్ద దొంగిలింపబడింది అందులో ఒకటిన్నర సవర బంగారం దండ చోరీ కేసులో నిందితుడు భరత్ గానే విచారణలో తేలింది. ఈ కేసులో భరత్ వద్ద నుండి ఒక బంగారు దండ, రూ.3000 నగదు, రెండు సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లుగా సిఐ తెలిపారు. నిందితుడిని అదుపులో తీసుకొని పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు. కేసును ఛేదించిన ఎసై చిన్న బలరామయ్యను అభినందించారు.

## గంటలపాటు ట్రాఫిక్ జామ్

**- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు**

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట** : మండలంలోని డేవిస్‌పేట కాలువలో ఉన్న వంతెన బ్రిటీష్‌కాలం నాటిది కావడంతో వంతెనకు పెద్ద రంధ్రం పడి రేపో మాపో అన్న పరిస్థితిలో ఉండడంతో పక్కనే ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేశారు. ఈ రహదారి ప్రతిరోజూ వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. ఉదయం, సాయంత్రం రద్దీగా ఉండే సమయంలో ఎదురెదురుగా వాహనాలు వెళ్లలేని ఈ వంతెనపై వాహనదారులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్కూలుకు వెళ్లే విద్యార్థుల దగ్గరుండి ఆఫీసుకి వెళ్లే ఆఫీసు వరకు ఈ వంతెనపై తీవ్ర ఇబ్బందులు ప్రతిరోజూ చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి త్వరితగతిన నూతన వంతెన ఏర్పాటు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## విజయవంతంగా సిఐటియు మండల మహాసభ

**ప్రజాశక్తి-కలిగిరి**



మండలంలో అంగన్ వాడీ, ఆశా, పంచాయతీ, ఫీల్డ్ అసిస్టెంట్ వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులతో కలిగిరిలోని హైస్కూల్లో సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.పెంచల నరసయ్య, సిఐటియు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ స్కీం వర్కర్స్, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైం కార్మికులకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే సంఘం సిఐటియు యూనియన్ అని తెలియజేశారు. అటువంటి సిఐటియుని బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు పెద్దఎత్తున ఉద్యమించాలన్నారు. కార్మిక చట్టాలను మార్పులు చేసి కార్మికుల హక్కులను హరించే విధంగా ప్రయత్నం చేస్తున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా స్కీం వర్కర్స్, ఆశా, అంగనవాడీ, విఆర్ఎ, పంచాయతీ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, వివిధ రంగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ, ఆశా, విఆర్ఎలు, పంచాయతీ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన సిఐటియు మండల కమిటీని ఏకగ్రీవంగా 11 మందితో ఎన్నుకున్నారు. నూతన కమిటీలో మండల కార్యదర్శి దువ్వూరి మేరీ, అధ్యక్షురాలు కత్తి.మంజుల, కమిటీ సభ్యులు ఎస్.కె.గౌసియా,కె.స్వరూప, యు.మంజుల, వి.ధనలక్ష్మి, సీతాదేవి, నాగరాజు, మహేశ్వరమ్మ, మస్తాన్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాశక్తి-కావలి** : కావలి మండల న్యాయ సేవాధికార సంస్థ (లోక్‌అదాలత్) ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సును చింతంవారి వీధిలో ఉన్న భారతీ వృద్ధ ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జీ ఎం.శోభ మాట్లాడుతూ పిల్లలు, జీవితంలో ఉన్నత స్థితికి చేరుకున్న తర్వాత పెద్దలను దూరం చేయెద్దని, వృద్ధాశ్రమాలలో చేర్చ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సమాజంలో గౌరవంగా మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కెన్నెడీ, సాయిప్రసాద్, సంస్థ నిర్వాహకులు కె.సీతాభాగ్యలక్ష్మీ, సీనియర్ న్యాయవాది అద్దేపల్లి శేషప్రసాద్ పాల్గొని చట్టాలను వివరించారు.

## ఎంఎల్‌సి ఓటు నమోదుకు ప్రచారం

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : ఆత్మకూరు పట్టణ పరిధిలో ఎంఎల్‌సి ఓటు నమోదు కార్యక్రమానికి ఆత్మకూరు ప్రాంత ప్రయివేటు ఉపాధ్యాయుల సంఘం గౌరవాధ్యక్షుడు సురా భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడు ఒంటేరు మల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రయివేట్ ఉపాధ్యాయులతో కలిసి ఎంఎల్‌సి ఓటు (ఉపాధ్యాయ, పట్టభద్రుల) నమోదు కోసం అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. అర్హత కలిగిన ఓటర్లు తమ ఓటును ఏడవ తేదీలోగా నమోదు చేసుకోమంటూ అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రయివేటు ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షులు సురా.భాస్కర్ రెడ్డితో పాటు సంఘ అధ్యక్షుడు వంటేరు మల్లికార్జున కార్యదర్శి సుధాకర్ రెడ్డి, కోశాధికారి వెండి.శ్రీకాంత్, ఇతర సిబ్బంది, ప్రయివేట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 7, 8వ తేదీల్లో సిఎం కప్ పోటీలు

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్** : జిల్లా అధికారుల ఆదేశాల మేరకు 17 సంవత్సరాలు పైబడిన ఉత్సాహవంతులైన యువతి యువకులకు రెండు రోజులు సోమ,మంగళ వారాలలో క్రీడాపోటీలు ఆత్మకూరు ప్రభుత్వ కళాశాల అవరణంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని క్రీడా అభిమానులు ఈ పోటీల్లో పాల్గొన్నవచ్చని తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన వారిని జిల్లాస్థాయి పోటీలకు బుధవారం ఎంపిక చేస్తామని తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులు కేతా వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పోటీలను ప్రారంభిస్తారన్నారు. జెడ్.పి.టి.సి. పెమ్మసాని లక్ష్మిప్రసన్న, ఎంఇఒ షేక్ నజీర్‌బాషా పాల్గొంటారని తెలిపారు.



ఇంటి చుట్టూ నీరు చేరివున్న దృశ్యం

## ఆదుకోండయ్యా సారూ..

**- వర్షం పడితే చాలు ఇళ్లల్లోకి నీళ్లు, నిద్రలేని రాత్రులు**
**- దుర్భర జీవితం గడుపుతున్న నరసాపురం గ్రామస్తులు**

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట**

తమను ఆదుకోవాలని నరసాపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నరసాపురం గ్రామంలోని పచ్చబట్ల శ్రీనివాసులు నివాసానికి ప్రక్కపోలల్లో నుంచి వర్షపునీరు ఇళ్లల్లోకి చుట్టుపక్కల నివాసాలకు రావడంతో వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వారి నివాసాల పక్కనే బడా భూస్వామి 40 ఎకరాలు పొలాన్ని సాగు చేస్తున్న తరుణంలో వర్షపు నీరు పోయేందుకు కాలువలు పూడిక తీయక పోవడంతో వర్షం పడితే తమ నివాసాలు పూర్తిగా జలమయం అవడం ప్రతి ఏటా ఆనవాయితీగా మారిందని, తమకు సంబంధించిన ప్రహరీ గోడలు సైతం పడిపోయాయని, తమ నివాసాల గోడలు కూడా నాని రేపో మాపో అన్నట్లు ఉన్నాయని గోళ్లుమంటున్నారు. నీళ్లల్లో ఉండే పాములు, కప్పలు తమకు తీవ్ర భయాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఇకనైనా సంబంధిత రైతు మేల్కొని కాలువలు తవ్వించి నీళ్ల తమ నివాసాల్లోకి రాకుండా అడ్డుకట్ట వేయాలని, సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా అందించాలని కోరారు.

# పెన్నాలో ఇసుకాసురులు..

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం**



పెన్నానదికి ఇసుక తవ్వకాలతో గర్భశోకం తప్పడం లేదు. భారీ యంత్రాలతో పెన్నాగర్భంలో నీరు వస్తున్నా తవ్వకాలు ఆపడం లేదు నిర్వాహకులు.. అక్రమాలే సరిహద్దుగా నిబంధనలు, అనుమతులకు విరుద్ధంగా ఎక్కడ బడితే అక్కడ తవ్వకాలు జరిపి పెన్నా ప్రవాహానికి అడ్డంకులు సృష్టిస్తున్నారు. పెన్నానదిలో వరదనీరు వచ్చి చేరుతున్న నదిని నిట్టనిలువునా చీల్చి పెద్దపెద్ద గుట్టలు ఏర్పాటు చేసి నది ప్రవాహానికి అడ్డంకులు సృష్టించి ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారు. దీని కారణంగా నది ప్రవాహం దారి తప్పి పొలాలను, గ్రామాలను నీట ముంచే అవకాశం లేకుండా పోలేదు. 10 భారీ యంత్రాలతో ఒకేరోజులో సుమారు వందల సంఖ్యలో చిన్న, భారీ, అతిభారీ వాహనాలలో ఇసుక తరలించేస్తున్నారు. 15 అడుగుల మేర లోతుకు ఇసుకను తవ్వుతున్నారు. నిబంధనలు పాటించకుండా రాబోవు తరాలకు శాపంలా ఆరాచకంగా తవ్వేస్తున్నారు. ఇది బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని మినగల్లు ఇసుక రీచ్‌లో ఒక్కదానిలోనే జరుగుతున్న తీరు కాదు.. ఇలా జిల్లాలో ఉండే 13 ఇసుక రీచ్‌లలో ఈ తంతు కొనసాగుతుంది. ఇంత జరుగుతున్నా అడిగే వారే కరువయ్యారు. రాత్రింబవళ్లు తేడాలేకుండా వందల సంఖ్యల్లో భారీ వాహనాలతో ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. ఇది ఇలానే కొనసాగితే రాబోవు తరాల వారి మనుగడ ప్రశ్నార్థకంలో పడే అవకాశాలు ఉన్నాయి. ఈ ఇసుకాసురులు నిరంకుశత్వానికి ప్రభుత్వం సైతం పట్టించుకోక పోవడం గమణార్హం. ప్రజలు ఎలా పోతే తమకేమీ జేబులు నిండితే చాలు అనే నాయకులను ఆపేవారే లేరా..? ఇకనైనా అధికారులు గానీ నాయకులు గానీ ఆపకపోతే రేపటి రోజున వచ్చే ఉపద్రవాలకు పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. అసలు వీళ్లకి మానవత్వం ఉందా లేదా.. సాటి మనుషులంటే కనికరం లేనట్లుందని వాపోతున్నారు.

**నిబంధనలు నిల్..** మినగల్లు ఇసుక రీచ్‌లో ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు నిర్వాహకులు. ప్రభుత్వ నిబంధనల మేరకు 5 నుంచి 6 అడుగులు మాత్రమే తవ్వకాలు జరపాలి కానీ దానికి విరుద్ధంగా 10 నుంచి 15 అడుగుల మేర విచ్చలవిడిగా తవ్వకాలు జరుగుతున్నాయి. మినగల్లు రీచ్2లో ఇసుక తవ్వకాలకు అనుమతులు ప్రభుత్వం ఇచ్చింది. కానీ ఇక్కడ మాత్రం మినగల్లు 1లో యథేచ్ఛగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో నిద్ర పోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

**ఇదే రాబోవు ముప్పు..** ఇసుకే కదా.. తవ్వి వాడేస్తే ఏమైతదిలే అన్నట్టే ఉంది. అక్రమంగా మైనింగ్ చేసేస్తూ.. ఇసుకను దోచేస్తున్న కొందరి తీరు కానీ, దాని వల్ల కలిగే ముప్పు ఇంతింత కాదని హెచ్చరిస్తున్నారు నిపుణులు, శాస్త్రవేత్తలు. పర్యావరణ సంక్షోభం తప్పదని, మనిషి మనుగడే ప్రమాదంలో పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నదుల్లో ప్రవాహం తగ్గిపోతుంది, తీర ప్రాంతాలు కోతకు గురవుతాయి. నదుల్లో స్వచ్ఛమైన నీరు పారక.. అప్పటి వదరకు మంచి పంటలు పండే భూముల్లో సారం తరిగిపోతుంది. పర్యావరణ స్వరూపం మారి తీవ్రమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయి. తుఫాన్లు తీవ్రరూపం దాల్చకుండా కాపాడడంలో ఇసుకది కీలక పాత్ర. తవ్వకాలు ఇలానే కొనసాగితే రాబోవు ముప్పు నుంచి తప్పించుకోవడం కష్టమని తెలుస్తుంది.

# రేపు జిల్లా వ్య.కా.సం. మహాసభ

**- జయప్రదం చేయాలని నాయకుల పిలుపు**

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం**



మండలంలోని దామరమడుగు గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య కళావిజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం 19వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంగళ పుల్లయ్య, జొన్నలగడ్డ వెంకమరాజు పిలుపునిచ్చారు. ఆదివారం దామరమడుగు గ్రామంలోని పుచ్చలపల్లి సుందరయ్య కళావిజ్ఞాన కేంద్రంలో జిల్లా మహాసభలకు జరుగుతున్న ఏర్పాట్లను వారు పరిశీలించి మండల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి కార్మికుల పొట్టగొడుతుందన్నారు. వ్యవసాయంలో యంత్రాలు రావడంతో వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి లేక కార్మికులు పట్టణాలు, నగరాల బాట పట్టి వివిధ రంగాలలో రోజువారీ కూలీలుగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సభల్లో చర్చిస్తామన్నారు. భూ పంపిణీ, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, ఉపాధి హామీ పనులు వంటి వాటిపై చర్చించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ మహాసభలకు వ్య.కా.సం. రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొని తమ సందేశాన్ని అందిస్తారని తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్య.కా.సం. మండల కార్యదర్శి తంబి రమణయ్య, కోవూరు మండల కార్యదర్శి పెద్దబ్బయ్య, గ్రామ అధ్యక్షుడు తాటిబోయిన మస్తానయ్య నాయకులు ఆలూరి కృష్ణయ్య, గుండాల రమణమ్మ, కోరికల విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-ఉదయగిరి**



తెలుగుదేశం పార్టీ మండల సర్వసభ సమావేశాన్ని విజయ వంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు చింతన బోయిన బయ్యన్న కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చెంచలబాబు యాదవ్ అతిథిగృహంలో సోమవారం ఉదయగిరి మండల సర్వసభ సమావేశం 3 గంటలకు ప్రారంభమవుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి ఉదయగిరి ఇన్‌ఛార్జి బొల్లినేని వెంకటరామారావు, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్‌పి చైర్మన్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు. కావున మండల నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.



## పాదయాత్ర విజయోత్సవ సంబరాలు



**ప్రజాశక్తి-ఉదయగిరి** : ప్రజాసంకల్ప యాత్ర 3648 కిలోమీటర్ పాదయాత్ర పూర్తి చేసి ప్రజల మన్ననలను పొందిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎంఎల్ఏ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఉదయగిరి వైసిపి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేకును ఉప సర్పంచ్ ముర్తుజా హుస్సేన్, దాసరపల్లి సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ కేక్ ను కట్ చేసి నాయకులు కార్యకర్తలు అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గడియాళ్ల యస్సాని, ఒప్పులూరు శ్రీనివాసులు, రోజా స్టూడియో పెంచలయ్య, సురేష్, చోటా తదితర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-మర్రిపాడు** : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకునిగా ఉన్న సమయంలో నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తి అయిన సందర్భంగా నందవరంలో సర్పంచ్ గాలిబోయిన రామ్మోహన్‌యాదవ్, శ్రీనివాసులు నాయుడు, మర్రిపాడులో కన్వీనర్ సుబ్బిరెడ్డి, శ్రీనివాసులునాయుడు వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలేసి కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-కావలి** : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి నేటికి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం తహశీల్దార్ వారి కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైసిపి నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కేక్ కటింగ్ చేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కావలి నియోజక వర్గ వైసిపి నాయకులు కనుమర్లపూడి వెంకట నారాయణ, అమరా వేదగిరి సుబ్బానాయుడుగుప్త, కుందుర్తి కామయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - వలేటివారిపాలెం**



ప్రజా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి మాదాల రమణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆవరణంలో దువ్వూరి జాన్ అధ్యక్షతన సిపిఎం మండల సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శి మాదాల రమణయ్య, మండల ఇన్‌ఛార్జి జివిబి కుమార్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు తాకట్టుపెట్టి రైతులు, కార్మికులు, ప్రజలపై తీవ్రమైన భారాలు మోపుతున్నాయన్నారు. ప్రభుత్వం రైతుల మోటార్లకు మీటర్లు పెట్టడం పట్ల రైతుల నుంచి వ్యతిరేకత వచ్చే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానన్న హామీ అమలు చేయకుండా విస్మరించారని దుయ్యబట్టారు. అంకభూపాలపురంలోని చింతమాను చేను ప్రభుత్వ భూములను భూమిలేని పేదలందరికీ పంచాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో నాయకులు సాధు చెన్న కేశవులు, పివి రామారావు, జీ మాధవ మూర్తి, ఎం.జక్రయ్య, నక్కా కోటేశ్వరరావు, నేలకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరులో క్రికెట్ బెట్టింగ్ జోరు

**ప్రజాశక్తి-అల్లూరు** : అల్లూరు నగర పంచాయతీ పరిధిలో ముమ్మరంగా క్రికెట్ బెట్టింగ్ జోరు విపరీతంగా కొనసాగుతుంది. ప్రపంచంలో క్రికెట్‌కు ఉన్న ప్రాధాన్యత ఇంకా ఏ ఆటకి లేదన్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. కాగా ఈ ఆటలను అడ్డుపెట్టుకొని కొంతమంది విచ్చలవిడిగా పందేలు కాస్తున్నారు. ఢిల్లీ, ముంబై ఇతర రాష్ట్రాలకు చెందిన బుకీల ద్వారా సబ్‌లైన్లు తీసుకొని ఈ తతంగాన్ని దర్జాగా నడిపిస్తున్నారు. హీటింగ్ తక్కువ, ఎక్కువ ప్లేయింగ్ ఎక్కువ, తక్కువ ఈ కోణంలో పలు యాప్‌ల ద్వారా బెట్టింగులు సాగుతున్నాయని జోరుగా ప్రచారం సాగుతుంది. అలాగే ఓపెనింగ్ ఫ్యాన్సీ బ్రాకెట్ 51లేక 52 ఓవర్ల మధ్య బెట్టింగ్ రాయుళ్లు పందేలు ఆడుతున్నారు. ఇండియా-పాకిస్తాన్ అయితే బెట్టింగులు మరింత జోరుగా అలాగే మరికొన్ని దేశాలు తలపడితే మరొక రేట్లు సాగుతున్నాయని సమాచారం. గతంలో ఒక ఏరియాని ఎంచుకుని బెట్టింగ్ దందాలు దర్జాగా చేస్తూ ఉండేవారు. ఇందులో చాలామంది విపరీతంగా లాభాలు పొందుతూ అధిక వడ్డీలకు నగదును ఇస్తూ ఉంటారు. ఈ వ్యసనాల బారిన పడ్డ అనేకమంది ఉన్నది పోగొట్టుకొని ఐపీలు పెట్టుకోవడం జరిగిందని కొందరు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు చేపట్టాలని కొందరు కోరుతున్నారు.

## జగనన్న లేఅవుట్లో నాణ్యత నిల్..!

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం** : నగర పంచాయతీ పరిధిలోని కట్టుబడిపాలెం జగనన్న లేఅవుట్లో ఏర్పాటు చేసిన నీటి పైపులైన్ వ్యవస్థ మూన్నాళ్ల ముచ్చటగా మారింది. పైపులైన్ వ్యవస్థ ఏర్పాటుచేసి పక్కనే ఉన్న అల్లూరు కాలువ నుంచి నీరు మోటర్ ద్వారా పంపింగ్ చేస్తున్నారు. కాంట్రాక్టర్ ధన దాహం కారణమా ఏమోగానీ తక్కువ నాణ్యత గల పరికరాలు, పైపుల వాడటం వల్ల పెట్టిన 20 రోజులకే పంపింగ్ మోటర్ వద్ద పెద్ద ఎత్తున లీకులు ఏర్పడి నీరు వంతెనపైకి ఎగిసిపడుతున్నాయి. లేఅవుట్‌లో మౌలిక వసతుల కోసం 70 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో రోడ్లు, విద్యుత్, నీరు ఏర్పాటు చేయాలి. ఆ నిధులలో కాంట్రాక్టర్లు నాణ్యత లేని పైపులు, పరికరాలు వాడి పనులను నాసిరకంగా చేపట్టి చేతులు దులుపుకున్నారు. నీటి సదుపాయంలోనే ఇంత జరుగుతుంటే మిగిలిన వాటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వీటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల పనులు మూన్నాళ్లకే మూలన పడుతున్నాయని ప్రజలు అనుకుంటున్నారు. పైప్ లైన్ ఏర్పాటు చేసిన తర్వాత మొదట్లో ట్రయల్ చేశారు. ఆ సమయంలో నాణ్యత లోపం కారణంగా పైపుల ఒత్తిడికి దిమ్మెలు, పైపులు దెబ్బతిన్నాయి. వారిలో ఎలాంటి మార్పు రాలేదు. అధికారులు, నాయకులు అండగా ఉండగా మమ్మల్ని అడిగే వారే లేరు అనే కాంట్రాక్టర్ల వ్యవహార శైలికి ప్రజలు భయపడుతున్నారని కొందరి అభిప్రాయం. ఏదేమైనా అధికారులు దీనిపై చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.